క్లుప్తంగా

వేడుకగా రామాలయ ప్రతిష్ఠ ఉత్సవాలు


కంకణధారణ పూజల్లో ఉభయదాతలు

కొనకనమిట్ల: మండలంలోని పేరారెడ్డిపల్లి గ్రామంలో సీతా లక్ష్మణ హనుమత్ సహిత పట్టాభిరామచంద్రస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు శుక్రవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. వేద పండితుడు గూడా లక్ష్మీనారాయణశర్మ బృందం ఆధ్వర్యంలో పూజా క్రతువులు నిర్వహిస్తున్నారు. కలశ స్థాపనలో ఉభయదాతలుగా గ్రామస్తులు వ్యవహరించారు.

భక్తి శ్రద్ధలతో విగ్రహాల ఊరేగింపు


ఊరేగింపులో పోలేరమ్మ, అంకాలమ్మ, పోతురాజు నూతన విగ్రహాలు

రాచర్ల: మండలంలోని కాలువపల్లె పంచాయతీ పరిధి గంగంపల్లె గ్రామంలో పోలేరమ్మ, అంకాలమ్మ, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా శుక్రవారం పోలేరమ్మ, అంకాలమ్మ, పోతురాజు నూతన విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అనంతరం శనివారం ఉదయం పోలేరమ్మ, అంకాలమ్మ, పోతురాజు నూతన విగ్రహాలను ప్రతిష్ఠస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా గ్రామంలో అన్నదానం నిర్వహించారు.

బదిలీపై వెళ్తున్న సీఐకి సత్కారం

గిద్దలూరు రూరల్: గిద్దలూరు అర్బన్ సీఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న వై.వి.సోమయ్యను బీజేపీ టౌన్ ప్రెసిడెంట్ అప్పిశెట్టి ఉదయ్‌శంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో బీజేపీ నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అప్పిశెట్టి ఉదయ్‌శంకర్ మాట్లాడుతూ సీఐ వై.వి.సోమయ్య అందరి మన్ననలు పొందారన్నారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలను సంరక్షించడంలోను తనదైన శైలిలో సేవలు అందించాడన్నారు. ఈ సందర్భంగా సీఐ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుమ్మారాముడు, మట్టిమల్ల పుల్లయ్య, రామాంజనేయులు, రమణ, మునగనూరి రామక్రిష్ణ, ముప్పూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రతి కౌలు రైతుకు సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీనాయక్

రాచర్ల: ప్రతి కౌలు రైతుకు సీసీఆర్‌సీ కార్డు తప్పనిసరిగా ఇవ్వాలని గిద్దలూరు ఏడీఏ డి.బాలాజీనాయక్ అన్నారు. మండల కేంద్రమైన తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలకు, రైతు భరోసా కేంద్రాల అగ్రికల్చర్ అసిస్టెంట్‌లకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో వ్యవసాయ భూమి కౌలుకు తీసుకుని కౌలు కార్డుకు దరఖాస్తులు చేసుకునే ప్రతి ఒక్కరికీ కౌలు గుర్తింపు కార్డులు వెంటనే మంజూరు చేయాలన్నారు. సీసీఆర్‌సీ కార్డు తీసుకున్న కౌలు రైతులకు ఈ కార్డు 11 నెలలు మాత్రమే హక్కు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భారతిబాయ్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో న్యాయమూర్తి తనిఖీ


విద్యార్థినులతో మాట్లాడుతున్న జడ్జి కిశోర్‌కుమార్

మార్కాపురం రూరల్: మండలంలోని రాయవరం కస్తూర్బా గాంధీ పాఠశాలను మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జె.కిశోర్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి విద్యార్థినులతో మాట్లాడారు. పాఠశాలలో వసతి సౌకర్యాలు, భోజనాన్ని పరిశీలించి సక్రమంగా అందుతున్నాయో లేదో తెలుసుకున్నారు. నాణ్యమైన విద్య, మంచి భోజనం అందించాలని ప్రిన్సిపాల్ విజయలక్ష్మికి సూచించారు. విద్యార్థినుల భద్రతపై పలు సూచనలు చేశారు. జడ్జి వెంట న్యాయవాదులు ఉషశ్రీ, ఎం.అన్వర్‌బేగ్, ఎస్జీఓ సంఘ ప్రతినిధి అనీల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

ఆర్‌ఓ బ్రిడ్జి లేక 'అష్ట'కష్టాలు

- తర్లుపాడులో రైల్వే గేటు వద్ద ప్రజల సహనానికి పరీక్ష
- రోజూ 25 వరకు రైళ్లు, గూడ్స్ బండ్ల రాకపోకలు
- గేటు పడితే 20 నిమిషాలు వాహనాల రాకపోకలు బంద్
- రోజు మొత్తం మీద సుమారు 8 గంటల పాటు గేటు మూత


గూడ్సు రైలు వెళ్తుండటంతో వేచి ఉన్న ప్రయాణికులు

తర్లుపాడు:

తర్లుపాడులోని రైల్వే గేటు ప్రజలు, ప్రయాణికుల సహనానికి పరీక్ష పెడుతోంది. ఈ మార్గంలో రోజూ సుమారు 14 రైళ్లు, మరో 10 గూడ్స్ బండ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రధానంగా గుంతకల్, హుబ్లీ, తిరుపతి, కాచిగూడ, ధర్మవరం, యశ్వంతపూర్, వాస్కోడిగామా, ప్రశాంతి, అమరావతి రైళ్లన్నీ తర్లుపాడు మీదుగానే వెళ్తాయి. వీటితోపాటు ఇతర రాష్ట్రాలకు బొగ్గు, సిమెంటు, ఇనుము తదితర సామగ్రిని తీసుకెళ్లే గూడ్సు రైళ్లు కూడా రోజుకు 10 వరకూ వెళ్తుంటాయి. రైలు వచ్చే ప్రతిసారీ 20 నిమిషాలపాటు రాకపోకలు నిలిచిపోతుండటంతో ప్రయాణికులు, వాహనదారులు ఆగిపోవాల్సి వస్తోంది. ప్రతి గంటకూ ఒకసారి రైల్వే గేటు మూతపడుతుంటంతో అత్యవసరంగా వెళ్లేవారు, అంబులెన్స్‌లో చికిత్స కోసం వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. గేటుపడిన సమయంలో ఆటోలు, టూవీలర్లు, కార్లు, ట్రాక్టర్లు, లారీలు ఇతరత్రా సామాన్లు తీసుకెళ్లే వాహనాలు కూడా గేటుకు అవతల వైపు, ఇవతల వైపు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది.

ఆర్‌ఓ బ్రిడ్జి ఏర్పాటు అవసరం

మార్కాపురం నుంచి కంభం, కనిగిరి వెళ్లేందుకు దగ్గరి దారి కావడంతో చాలా మంది ఉద్యోగులతోపాటు బొడిచర్ల, బొందలపాడు, తాడివారిపల్లి, కంభం, బేస్తవారపేట, గిద్దలూరు వెళ్లేవారు ఈ మార్గాన్నే ఎంచుకుంటారు. సుమారు 20 గ్రామాల ప్రజలు ఇదే మార్గంలో ప్రయాణిస్తుంటారు. ఈ నేపథ్యంలో రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. మార్కాపురం పట్టణం, తర్లుపాడు వైపే అభివృద్ధి చెందుతోంది. ప్రధానంగా నూతన కాలనీల ఏర్పాటు, అల్లూరి పోలేరమ్మ గుడి దాటి సీతానాగులవరం వరకూ విస్తరించి ఉంది. మండల కేంద్రం కావడంతో పలువురు అధికారులు, ఉపాధ్యాయులు మార్కాపురం నుంచి తమ ద్విచక్రవాహనాలపై తర్లుపాడుకు వస్తుంటారు. రైలు గేటు పడే సమయంలో సుమారు 20 నిముషాల పాటు వేచి ఉండటం వల్ల సమయం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


తర్లుపాడు వద్ద రైలు గేటు పడటంతో నిలిచిన వాహనాలు

రైల్వే గేటుకు మరమ్మతులు

మండల కేంద్రం తర్లుపాడులోని రైల్వే గేటు వద్ద ఈనెల 12, 13వ తేదీన మరమ్మతులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలు వాహనాల రాకపోకలకు అంతరాయం కలగనుంది. ప్రయాణికులు గమనించి ఇతర మార్గాల్లో ప్రయాణించి సహకరించాలని రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలి



రోజూ వందలాది వాహనాలపై ఉద్యోగస్తులు, ప్రజలు, స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు మార్కాపురం నుంచి తర్లుపాడు మీదుగా కంభం వైపు రాకపోకలు సాగిస్తుంటారు. అత్యవసర సమయాల్లో గేటు మూతపడితే 20 నిమిషాలు వేచి ఉండాల్సి రావడం ఇబ్బందిగా ఉంటోంది. రోగులకు సకాలంలో వైద్యం అందడం లేదు. గతంలోనూ పలువురు ప్రజాప్రతినిధులకు, రైల్వే అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. పరిష్కారం కాలేదు. రైల్వే ఉన్నతాధికారులు చొరవతీసుకుని తర్లుపాడు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి.

– అక్బర్ అలీ, తర్లుపాడు

కార్పొరేట్ సంస్థలను బహిష్కరించాలి

మార్కాపురం: కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతోందని ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి విమర్శించారు. దేశ సంపదను లూటీ చేస్తున్న కార్పొరేట్ సంస్థలను బహిష్కరించాలని కోరుతూ కిసాన్ మోర్చా, రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం స్థానిక కోర్టు సెంటరులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ దేశ ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తూ లక్షల కోట్ల రూపాయలను ఆర్జిస్తున్న బీఎస్‌ఎన్‌ఎల్, రైల్వేలు, ఎల్‌ఐసీ, హిందుస్థాన్ పెట్రోల్ కంపెనీ లిమిటెడ్, పౌర విమానయాన శాఖ, హిందూస్థాన్ పెట్రోలియం ఉత్పత్తులు తదితర సంస్థలను నష్టాల్లో ఉన్నాయని చూపి అత్యంత చౌకగా అంబానీ అదానీలకు కట్టబెడుతూ మోదీ ప్రభుత్వం జాతి సంపదను దుర్వినియోగం చేస్తోందని తీవ్రంగా ధ్వజమెత్తారు. వ్యవసాయం కోసం రైతులు తీసుకున్న రుణాన్ని ప్రతికూల పరిస్థితుల్లో కట్టలేకపోతే నానా హంగామా సృష్టించే బ్యాంకర్లు.. లక్షల కోట్ల రూపాయల రుణం తీసుకుని దేశ సరిహద్దులు దాటి పారిపోతున్న బడా కార్పొరేట్ల విషయంలో ప్రేక్షక పాత్ర వహిస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. తమ భద్రత కోసం సామాన్య ప్రజలు బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకున్న డబ్బును పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టే అధికారం వీళ్లకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. రైతు సంఘం కార్యదర్శి అందె నాసరయ్య మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక మరోవైపు పంట కోసం తెచ్చినప్పుడు తీర్చలేక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు గుమ్మ బాల నాగయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఖాశిం, నియోజకవర్గ ఏపీ రైతు సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, పీవీ కొండయ్య, ఏఐటీయూసీ నాయకులు వై.వెంకటరెడ్డి, ఎల్లయ్య, సీపీఐ నాయకులు జి.కాశయ్య, కేవీపీఎస్ నాయకులు జవ్వాజి రాజుతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.


ధర్నాలో పాల్గొన్న వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు

వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యేలు


వధూవరులను ఆశీర్వదిస్తున్న అన్నా దంపతులు


వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల

కొనకనమిట్ల: మండలంలోని నాయుడుపేట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ నాయకుడు వాకా రమణారెడ్డి కుమారుడు సుబ్బారెడ్డి, మణి వివాహ వేడుకకు వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఆయన సతీమణి దుర్గ, పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ ఉన్నం శ్రీనివాసులు, పార్టీ జిల్లా విద్యార్థి విభాగం కన్వీనర్ ఏలూరి సంజీవరెడ్డి, గొట్లగట్టు ఉప సర్పంచ్ గాడి కోనేటిరెడ్డి, సొసైటీ చైర్మన్ ఉడుముల కాశిరెడ్డి, పార్టీ నాయకులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలతో రైతులకు నష్టం

గిద్దలూరు రూరల్: కార్పొరేట్ సంస్థల వల్ల రైతులకు నష్టం వాటిల్లుతుందని రైతు సంఘం గిద్దలూరు ఏరియా కన్వీనర్ వి.రామకృష్ణ అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చ పిలుపు మేరకు క్విట్ కార్పొరేట్స్ ఇన్ అగ్రికల్చర్ సెక్టార్ ధర్నా కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించారు. అనంతరం వారి సమస్యల పరిష్కారం కోసం తహశీల్దార్ ఆంజనేయరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో కార్పొరేట్ సంస్థలు ప్రవేశించడం వల్ల సామాన్య రైతులకు నష్టం కలుగుతుందన్నారు. ఇప్పటికే కార్పొరేట్ సంస్థలకు పన్ను 30 శాతం నుంచి 20 శాతం వరకు తగ్గించారన్నారు. ఎం.స్వామినాథన్ కమిటీ సిఫార్సు చేసిన మద్దతు ధర ఇస్తే సామాన్యులకు తిండి గింజల ధరలు పెరుగుతాయని నరేంద్రమోదీ ప్రభుత్వం అబద్ధాలు చెబుతూ ప్రచారం చేస్తోందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పూర్ణ, రామిరెడ్డి, చంద్రపాల్, థామస్, ఏసేబు, కాశయ్య, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతి ప్రతం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఘనంగా పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ


ఆలయం వద్ద భక్తుల సందడి

కొనకనమిట్ల: మండలంలోని రేగడపల్లి గ్రామంలో పోలేరమ్మ తల్లి, పోతురాజుస్వామి నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు శుక్రవారంతో వైభవంగా ముగిశాయి. మేళతాళాలు, భక్తుల కోలాహలం మధ్య దేవతామూర్తు విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆగమ పండితుడు కారంచేటి దక్షిణామూర్తి, శిష్యబృందం ఆధ్వర్యంలో పూజా క్రతువులు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నైవేద్యాలు సమర్పించారు. గ్రామస్తుల సహకారంతో భక్తులకు అన్నసంతర్పణ చేశారు.


అలంకరణలో పోలేరమ్మతల్లి

ఘనంగా వీర బ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మార్కాపురం టౌన్: మండలంలోని దరిమడుగు గ్రామంలో శుక్రవారం పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి విగ్రహ, ధ్వజ స్తంభ, నవగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ నెల 7వ తేదీ ప్రారంభమైన ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం గుంటూరు జిల్లా లాం గ్రామానికి చెందిన గూడూరు కామేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు తురకా పెద్ద అల్లూరయ్య, రామయ్య, శంగలయ్య, వెంకటేశ్వర్లు, డీపీ అంకయ్య, తురకా వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ బట్టగిరి గౌతమి గోపి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జవ్వాజి రంగారెడ్డి, బట్టగిరి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ధ్వజ స్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

ప్రజల సమస్యలపై సత్వరమే స్పందించాలి

గిద్దలూరు రూరల్: ప్రజల నుంచి వచ్చే సమస్యల పట్ల సత్వరమే స్పందించాలని తహశీల్దార్ ఆంజనేయరెడ్డి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని రెవెన్యూ అధికారులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూపరంగా ప్రజల నుంచి వచ్చే సమస్యలపై త్వరితగతిన స్పందించేలా ప్రతి అధికారి పనిచేయాలన్నారు. ప్రజల ఫిర్యాదులను పరిష్కరించడంలో అంకితభావంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మండలంలోని ప్రభుత్వ చౌకదుకాణాలకు చెందిన డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రేషన్ సరుకులు వేసే సమయంలో డీలర్లు అవకతవకలకు పాల్పడకుండా సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కార్డుదారుల నుంచి ఫిర్యాదులు తలెత్తకుండా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు వై.పి.రంగయ్య, అచ్చయ్య, ఈశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రామలింగయ్య, తదితరులు పాల్గొన్నారు.


రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న తహశీల్దార్

ఘనంగా అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

తర్లుపాడు: మండలంలోని నాగెళ్లముడుపు బీసీ కాలనీలో శుక్రవారం అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులను ఆత్మీయంగా పలకరించి క్షేమసమాచారాలు తెలుసుకున్నారు. సర్పంచ్ తిరుమల బాలసుబ్బమ్మ, వైస్ సర్పంచ్ సీహెచ్ వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ సుజాత, ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, గొల్లపల్లి సర్పంచ్ రామిరెడ్డి, పార్టీ నాయకులు బాలగురవారెడ్డి, మేకల వెంకటరెడ్డి, వి.కోటయ్య, బ్రహ్మయ్య, శ్రీను, వెంకయ్య తదితరులు మాజీ ఎమ్మెల్యే అన్నాకు స్వాగతం పలికారు.


పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, నాయకులు

ఫేస్‌బుక్‌లో అనుచిత పోస్టుపై ఫిర్యాదు

కంభం:

సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి పై అనుచిత పోస్టు చేశాడంటూ టీడీపీ నాయకుడు రఫి (ఎస్ఆర్ఐ) ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైఎస్సార్ సీపీ కార్యకర్త షేక్ ఇర్ఫాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన గురువారం రాత్రి కంభంలో జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం గం.3.30 వరకు స్టేషన్‌లో ఉంచుకొని ఆ తర్వాత వదిలేశారు. ఆ తర్వాత ఫేస్ బుక్ లాగిన్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించిన పోలీసులకు వైఎస్సార్ సీపీ కార్యకర్తే పోస్టు చేసినట్లు సరైన ఆధారాలు దొరకలేదని సమాచారం. ఈ నేపథ్యంలో మరో టీడీపీ నాయకుడు శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులెవరో సీఎం పై అనుచిత పోస్టు చేశారని, వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని మరో ఫిర్యాదు చేయడంతో ముందు ఇచ్చిన ఫిర్యాదు కాగితాన్ని తొలగించి కొత్త ఫిర్యాదు పై కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఈ విషయంపై స్థానిక ఎస్సై ను వివరణ కోరగా ఫేస్‌బుక్ లో అనుచిత పోస్టు పెట్టడం పై కేసు నమోదు చేసి పోస్ట్ చేసిన వ్యక్తి కోసం విచారణ చేపట్టినట్లు తెలిపారు. మైనారిటీ యువకుడి పై అధికార పార్టీకి చెందిన ఓ మైనారిటీ నాయకుడితో కేసు పెట్టించి ఇబ్బందులకు గురిచేసే చర్యలు మానుకోవాలని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మలిదిన్నె చెన్నారెడ్డితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు హితవు పలికారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవార పూజలు


పొదిలిలో పూజలందుకుంటున్న మహలక్ష్మి అమ్మవారు

పొదిలి: శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా పొదిలి పట్టణంలోని పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి ఆలయం, నిర్మమహేశ్వరస్వామి ఆలయం, వేణుగోపాలస్వామి ఆలయం, వాసవీ మాత ఆలయం, అంకాల పరమేశ్వరి, మహలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆళ్వార్లు, ఆచార్యుల ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం


విష్ణు సహస్ర నామ పారాయణంలో పాల్గొన్న మహిళా భక్తులు

మార్కాపురం: పట్టణంలోని కంభం రోడ్డులో ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆళ్వారులు, ఆచార్యుల ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 11వ తేదీ వరకు ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం పూజా కార్యక్రమాల్లో భాగంగా విష్ణు సహస్ర నామ పారాయణం, జలాధివాసం, క్షీరాధివాసం తదితర పూజలు, పారాయణాలు నిర్వహించారు.